




రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

పథకాల చుట్టూ.. పాలి'ట్రిక్స్'!



- వాగ్వాదానికి దిగుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు
- సంక్షేమ పథకాల ప్రచారానికి సిద్ధమవుతున్న కాంగ్రెస్
- లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తున్న ప్రతిపక్షాలు
- స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా ముందుకెళ్తున్న పార్టీలు
- ఎటూ తేల్చుకోలేక అయోమయానికి గురవుతున్న జనం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల చుట్టే పాలిటిక్స్ అన్నట్లుగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే ఆరు గ్యారంటీలలో కొన్నింటిని అమలు చేసిన ప్రభుత్వం.. ఇటీవల మరో నాలుగు పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. దీంతో అర్హులైన లబ్ధిదారులతో పాటు రైతులు, ఇతర వర్గాల్లో ఎంతో ఆసక్తి నెలకొంది. గతనెల 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అంటూ నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పరిస్థితులు అనుకూలించక పోవడంతో లాంఛనంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అధికారులు అందించారు. మిగితా గ్రామాలలో దశల వారీగా పథకాలను అమలు చేస్తామని ప్రకటించడంతో అంతటా ఎదురు చూపులు తప్పడం లేదు. గ్రామ, పట్టణాల్లో ఏ నలుగురు కలిసిన పథకాల అమలు గురించే మాట్లాడుకోవడం కనిపిస్తోంది. అలాగే అధికార, ప్రతిపక్ష నేతలు ఎవరికి వారే సంక్షేమ పథకాలపై వాదనలకు దిగుతున్న సందర్భాలున్నాయి. కొన్నిచోట్ల మాటమాట పెరిగి పోవడంతో వివాదాలకు దారి తీస్తోంది. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపిక, పథకాల అమలు వంటి అంశాలు విభేదాలకు కారణమవుతున్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు ఎవరికి వారే గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేయడంతో అమాయక ప్రజలు ఎటూ తేల్చుకోలేక అయోమయానికి గురవుతున్నారు.





శ్రేణులకు దిశానిర్దేశం

అధికార కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దిశానిర్దేశం చేయడంతో ఆ పార్టీ శ్రేణులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలు, వార్డుల్లో సంక్షేమ పథకాల అమలుపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారానికి దిగుతున్నారు. త్వరలోనే ఎన్నికలు వచ్చే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ క్యాడర్ అప్రమత్తమైనట్లు తెలుస్తుంది. నేతలు ఎక్కడికి వెళ్లిన అభివృద్ధి పనుల జోలికి వెళ్లకుండానే సంక్షేమ పథకాల అమలు తీరుపైననే మాట్లాడడం కనిపిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అములులో ఉండడంతో అభివృద్ధి పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వివిధ కార్యక్రమాల పేరిటా నియోజకవర్గ స్థాయి నేతలు గ్రామాలు, పట్టణ వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ పథకాల ప్రచారానికి దిగుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తోందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రచారం ఏ మేరకు ప్రజల్లోకి వెళ్తుందో? అసలు పసిగట్టలేక పోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది.

ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన ఎజెండా

పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ఎదురుదాడికి దిగేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఏ పథకం? ఎంత మందికి అందుతుంది?, అసలు ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు? అధికారులు చేపట్టిన సర్వే వివరాలను సేకరిస్తూ ఆధారాలతో సహా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించాల ని డిమాండ్ చేస్తున్నాయి. కొన్నిచోట్ల అనర్హులకు పథకాలు అందడంపై ఘాటైన విమర్శలకు సైతం దిగుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రజల్లోకి వెళ్తూ ప్రభుత్వ అనాలోచిత విధానాలను ఎత్తి చూపుతున్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరాన రూ.7500లను అందిస్తామని చెప్పినా.. ప్రభుత్వం మాట తప్పిందని విమర్శలకు దిగుతున్నారు. జనవరి 26 నుంచి ఒకేసారి నాలుగు పథకాలను



(తరువాయి 6వ పేజీలో...)

పాఠశాలలో టీబీపై అవగాహన సదస్సు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బంగారుగూడ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో శుక్రవారం టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ సర్ఫరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ రికార్డులను పరిశీలించారని తెలిపారు. అలాగే ఎక్స్‌రే వాహనంలో గ్రామంలోని ప్రజలకు ఎక్స్‌రే తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి, సూపర్ వైజర్ శకుంతల, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీదేవి, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేమ్ సింగ్, ల్యాబ్ టెక్నీషన్ సమి, ఆశా కార్యకర్తలు రాధ, గంగమ్మ పుష్ప, గంగమ్మ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే.. ఎలాంటి అంగవైకల్యం రాదు : నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగ వైకల్యం రాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టీ)మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో స్పర్శ్ లెప్రసీ అవర్నెస్‌లో భాగంగా అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కుష్టు లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సలు, తదితర వాటి గురించి తెలిపారు. అనంతరం కుష్టు నివారణకు పాటుపడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియం లేప్రె అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందన్నారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు వారిన మచ్చలు, కాళ్లు, చేతుల్లో తిమ్మర్లు రావడం కుష్టు వ్యాధికి లక్షణాలన్నారు. ప్రాథమిక దశలో దీన్ని గుర్తించి చికిత్సలు తీసుకుంటే అంగవైకల్యం రాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి గజానన్, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావ్, ఎంఎల్‌హెచ్‌పీ అశ్విని, ఆరోగ్యపర్యవేక్షకుడు సుభాష్, ఏఎన్ఎం తార, స్కూల్ ప్రిన్సిపల్ వందన, ఆశా కార్యకర్త పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో ఛాయాదేవి

పదో తరగతిలో 10 జీపీఏ సాధించాలి

- ఐటీడీఏ జీసీడీపీ ఛాయాదేవి

తలమడుగు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతి విద్యార్థి 10జీపీఏ సాధించాలని ఐటీడీఏ జీసీడీవో ఛాయాదేవి కోరారు. శుక్రవారం మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఉమ్రి(టి) పాఠశాలను జీసీడీవో మెస్రం ఛాయా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలని, అందరూ 10 జీపీ సాధించాలని, సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలు, వంట గది పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సిక్ రూమ్ శుభ్రంగా ఉంచాలని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏఎన్ఎంలకు సూచించడం జరిగింది. అలాగే 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, రోజు వారీగా నిర్వహిస్తున్న విషయాల వారి స్లిప్ టెస్టుల రికార్డులను పరిశీలించారు. అనంతరం వంట గది, వంట సరుకులను పరిశీలించారు. పిల్లలకు ఇప్పు పువ్వుతో చేసిన లడ్డూలను పంచారు. విటమిన్ సి, ఐరన్ టాబ్‌లెట్లు ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాలో టీచర్ ఉద్యోగాల్లో సర్టిఫికెట్స్ రీ వెరిఫికేషన్ నిర్వహించాలి

- ఆదివాసీ విద్యార్థి సంఘం డిమాండ్

ఉట్నూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన డీఎస్సీ టీచర్ ఉద్యోగ నియామకాలలో అవకతవకలు చోటు చేసుకున్నందున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీచర్ ఉద్యోగాలు పొందిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగ్‌దేవ్‌పటేల్, జిల్లా అధ్యక్షుడు మంగం దీపక్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైదరాబాద్ పరిధిలో మొత్తం 35 మంది నకిలీ బోనాఫైడ్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందడంతో హైదరాబాద్ డీఈవో వారిని ఉద్యోగాల్లో నుంచి తొలగించడం శుభపరిణామం అన్నారు. ఇదే మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని వెంటనే తొలగించాలని, నకిలీ బోనఫైడ్ ఇచ్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై చీటింగ్ కేసు నమోదు చేసి పాఠశాల గుర్తింపు వెంటనే రద్దు చేయాలని, వెరిఫికేషన్‌లో ఆలసత్వం ప్రదర్శించిన సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో టీచర్ ఉద్యోగాలలో హడావిడి వెరిపికేషన్ జరిగిందని, ఏళ్ల తరబడి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు అన్యాయం చేస్తూ విద్యాశాఖ నిర్వహించిన వెరిఫికేషన్ సరళిపై అనేక అనుమానాలు ఉన్నాయని, వ్యాయమ ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఇష్టా రాజ్యాంగం నియమకాలు జరుగాయని ఆరు కాలం అప్పులు చేసి కోచింగ్ సెంటర్‌లలో నిరుపేద నిరుద్యోగుల జీవితాలు గడిచిపోతున్నాయని, పలుకుబడితో అక్రమ మార్గాల్లో, నకిలీ పత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని, వారికి సహకరించిన పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని వారు పేర్కొన్నారు.



జెండాకు ప్రత్యేక పూజలు చేస్తున్న ముఖడే ఉత్తం

ఘనంగా ధ్యానకేంద్రం వార్షికోత్సవం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హర్కాపూర్(అందుగూడ) గ్రామంలో సద్గురు పరమ హంస పులాజీ బాబా ధ్యాన కేంద్రం 18వ వార్షికోత్సవం కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు శుక్రవారం పూలాజీ బాబా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడుతూ పూలాజీ బాబా చూపిన అధ్యాత్మిక మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుడే కైలాష్, పాఠశాల హెచ్ఎం శ్రీరామ్, మాస్కే భారత్, డాకురే ఆత్మారామ్, తదితరులు పాల్గొన్నారు.

హరిత సేన ఇన్‌చార్జిగా బొడ్డు నరేష్

ఉట్నూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హరితసేన గ్రీన్ ఇండియా చాలెంజ్ సంస్థ మండల ఇన్‌చార్జీగా ఉట్నూర్‌కు చెందిన బొడ్డు నరేష్‌ను నియమించడం జరిగిందని హరిత సేన గ్రీన్ ఇండియా డైరెక్టర్లు రాఘవయాదవ్, బాధావత్‌పూర్ణ చందర్ నాయక్, పోడేటి నరేష్‌గౌడ్‌లు తెలిపారు. ఈమేరకు బొడ్డు నరేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బొడ్డు నరేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామాలలో తిరుగుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని, వారిలో చైతన్యం కలిగిస్తామని పేర్కొన్నారు.

'కందులు కొనుగోలు చేయాలి'

తాంసి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కంది పంట చేతికి వచ్చి పక్షం రోజులు కావొస్తున్నా.. ఇంకా ఎందుకు కొనుగోలు చేయడం లేదని? మండల రైతులు ప్రశ్నిస్తున్నారు. తాంసి మండల కేంద్రంలో ప్రతీ సంవత్సరం సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేవారని, కాని ఈ సంవత్సరం ఎందుకు కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి కందులు కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



కబడ్డీలో ప్రథమ విజేత సూర్యాపేట జిల్లా జట్టు

అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- అంతర్జాతీయ కబడ్డీ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్ యాదవ్
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ముగిసిన సీనియర్ రాష్ట్రసాయి కబడ్డీ పోటీలు

వివరాలు 7వ పేజీలో...

రాష్ట్ర పండుగగా కుమరంభీం వర్ధంతి

- సీఎంను కలసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బొజ్జు, కుమ్రంభీం మనువడు
- కుమ్రం సోనేరావును సన్మానించిన శాసనసభ స్పీకర్



సీఎంని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, కుమ్రంభీం మనవడు సోనేరావు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) గోండు వీరుడు కుమ్రం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, కుమ్రంభీం మనువడు కుమ్రం సోనేరావుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు.కుమ్రం భీం పోరాటానికి అండగా నిలబడి పోరుసల్పిన జోడేఘాట్ పరిధిలోని 12 గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని, రోడ్లు, ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీని మొట్టమొదటి సారి సందర్శించిన కుమ్రంభీం మనువడు సోనేరావును శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సన్మానించారు.

నేటి నుంచి చెక్‌పోస్టుల వద్ద ఆంక్షల ఎత్తివేత



రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఆదిలాబాద్(ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని అటవీశాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం 6గంటల వరకు వాహనాల రాకపోకలను నిషేధిస్తూ విధించిన ఆంక్షలను శుక్రవారం ఎత్తి వేసిందని, ఇకపై చెక్‌పోస్టుల వద్ద అటవీ శాఖ వేదింపులు ఉండవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ తెలిపారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ రాకేష్‌డోబ్రియాల్‌ను కలసి అటవి శాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాత్రి వేళలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. నేటి నుంచి చెక్‌పోస్టుల వద్ద నుంచి ఒక్క ఫిర్యాదు రాకూడదని ఎమ్మెల్యే పీసీసీఎఫ్‌కు సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి వేదింపులు ఉండవని స్థానికులు తమ ఆధారాలు చూపి రాకపోకలు సాగించవచ్చని వారిని అడ్డుకోకుండా అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు పీసీసీఎఫ్ హామీ ఇచ్చారు. వారి వెంట ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుత్పల, యాపాలగూడ, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన పలువురు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ నిచ్చారు. అంతేకాకుండా విద్య, వైద్యం, రహదారులపై ప్రత్యేకదృష్టి సారిస్తానన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- వాంకిడిలో పర్యటించిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామంలో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మసీద్‌లో ఎమ్మెల్యేను మైనారిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలన్నిటికీ పరిష్కారం చూపుతానన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి వసతుల గురించి తెలుసుకున్నారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ రాజు, నేరడిగొండ మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన లక్ష్మీపూర్ గ్రామస్థులు

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి : డీఐఈవో

జైనథ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అభ్యసిస్తున్న ఇంటర్ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలని డీఐఈవో రవీందర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ కళాశాలని సందర్శించి పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.రాము, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జైనథ్, ఫిబ్రవరి 07 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూర వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ గ్రామస్థులంతా ఐక్యమత్యంగా ఉండి స్వామివారి బ్రహ్మోత్సవాలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, నాయకులు రాందాస్, విజయ్, అశోక్ రెడ్డి, రాకేష్, విలాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలోనే యజ్ఞయాగాలు'

ఆదిలాబాద్, ఫిబవ్రరి 7(ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎన్నో యజ్ఞయాగాలు జరిగాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న శ్రీరాధాకృష్ణ ఆలయానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన కలిగిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో యాగాలు, యజ్ఞాలు చేసి ఆలయ నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎన్నో నూతన ఆలయాలను నిర్మించుకోవడం జరిగిందన్నారు. కాగా, ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఇందులో మాజీ కౌన్సిలర్లు పవన్‌నాయక్, ఇజ్జగిరి నారాయణ, కలీం, లక్ష్మణ్, సంతోష్, విజయ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోథ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బాలికలు సైబర్ నేరాల పట్ల ప్రమాదంగా ఉండాలని షీ టీం ఏఎస్ఐ సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, ఫోటో మార్ఫింగ్ సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్మెయిలింగ్ పాల్పడితే 100, 1930 నెంబర్లకు కాల్ చేసి తమకు జరుగుతున్న ఇబ్బందుల గురించి వివరించాలన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించిన తమ దృష్టికి తీసుకువస్తే తమ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సుశీలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సచిన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఆర్‌కే కాలనీ వృద్ధాశ్రమంలో సామాజిక కార్యకర్త మస్కురి పోతన్న జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. అంతకుముందు రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్మైల్ సొసైటీ సభ్యులు భూరె సురేష్, రవికాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



● పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకే

మండల స్థాయిలో ప్రజావాణి

● జిల్లా పరిషత్ సీఈవో జితేందర్‌రెడ్డి ● తలమడుగులో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రజావాణి బహిరంగ చర్చా వేదిక



తలమడుగులో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి



అర్జిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

తలమడుగు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ అధికారిలో జవాబుదారితనాన్ని పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం మండలస్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా పరిషత్ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద మండల స్థాయి ప్రజావాణి బహిరంగ చర్చా వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా లబ్ధిదారులు వారికి పథకాలు అందనియెడల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారాలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి 15 నుంచి 30 రోజుల్లోనూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గతంలో వివిధ శాఖలలో వచ్చిన 286 మంది ఫిర్యాదుదారులను ఒక్కొక్కరి సమస్యను వారితో చెప్పిస్తూ సంబంధిత అధికారితో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టేలా బహిరంగ విచారణ చేపట్టారు. ఆర్‌వోఎఫ్ఆర్, అటవీ భూమి హక్కుదారులు మరణించిన తర్వాత వారి విరాసత్ భూమి సమస్యలు, గ్యాస్ సబ్సిడీ సమస్యలు, విద్యుత్ బిల్లులు, రుణమాఫీ, రేషన్ కార్డు, ఇందిరమ్మ భరోసా పథకానికి సంబంధించిన పథకాలు తమకు రాలేదని పలువురు ఫిర్యాదుదారులు అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జెడ్పి సీఈవో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ 15 రోజులకు ఒకసారి మళ్లీ బహిరంగ విచారణ సభలు మండల కేంద్రాల్లో అధికారులంతా కలిసి నిర్వహిస్తారన్నారు. ఆయా పథకాలకు అర్హులైన వారు ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్, మండల ప్రత్యేక అధికారి గజానన్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, కిసాన్ మిత్ర సభ్యులు, మేకల రమకాంత్ యాదవ్ ఎంపీఈవో వినోద్ సివిల్ సప్లై అధికారి పంచాయతీ సెక్రెటరీలు, అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో మహామాయ ఉపాసిక సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రమాబాయి 127వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని మహిళలు రమాబాయి అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఈ రోజు మహిళలకు అన్నివిధాలుగా హక్కులు లభించాయన్నారు. అంబేద్కర్ విజయం వెనుక రమాబాయి పాత్ర ఎంతో ఉందన్నారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, కాంబ్లే ఉత్తం, సావంత్ లహుదాస్, తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

తాంసి: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 128వ జయంతిని శుక్రవారం మండలకేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. మహార్ తెగకు చెందిన యువకులు, మహిళలు పెద్దఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రమాబాయి చిత్రపటంతో గ్రామంలోని పుర వీధుల గుండా నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. నిరుపేదలందరికీ దుస్తులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ చేసిన సేవలు, రమాబాయి దేశానికి అందించిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాంసి మాల మహార్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మొట్టె ప్రదీప్, ఉపాధ్యక్షుడు కె.అశోక్, కోశాధికారి పాటిల్ సంతోష్, సంయుక్త కార్యదర్శి పాటిల్ లింబాద్రి, కమ్మరి సుధాకర్, మొట్టే మనోజ్, భగత్ సోనూ, సగడం ప్రశాంత్, సందీప్, మునీశ్వర పాల్, తదితరులు పాల్గొన్నారు.

● రమాబాయి అంబేద్కర్ త్యాగాలు చిరస్మరణీయం

నార్నూర్: మాతా రామాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలను మండలకేంద్రంలోని త్రీరత్న బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాల మహానాడు ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ లోకండే మాతారామాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాబాయి అంబేద్కర్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఇందులో మాల మహానాడు నాయకులు సునీల్ చలుర్కార్, కర్మన్కర్ మనోహర్, మీనా చునర్కర్, నిర్మల, శారద, రుక్మాబాయి, తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో పూజలు చేస్తున్న మహార్ సంఘం నేతలు

పథకాల చుట్టూ పాలి'ట్రిక్స్'!

(.... 5వ పేజీ తరువాయి)



అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. మళ్లీ వెనుకడుగు వేసిందని ఆరోపిస్తున్నారు. రైతు భరోసా అందకపోవడంతో రైతులు పెట్టుబడి సహాయానికి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంటూనే రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వ విధానాలే అసలు కారణమంటూ విమర్శిస్తున్నారు.

నేతల హడావుడి

స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు హడావుడి చేస్తున్నారు. త్వరలోనే ఎన్నికలు రావడం ఖాయమని తేలిపోవడంతో నేతలు సంక్షేమ పథకాలతో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా లబ్ధిదారుల జాబితాను సేకరించి తామే మంజూరు చేయించామంటూ చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా ప్రధాన పార్టీలు ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. కానీ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో దానికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఎందుకంటే పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడంతో కొంత గందరగోళ పరిస్థితికి దారి తీస్తుంది. కొందరికి మాత్రమే పథకాలు అందడం చాలా మంది లబ్ధిదారులకు అందకపోవడంతో క్షేత్రస్థాయిలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులతో అధికార పార్టీ నేతలు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసినా.. ఫలితాలు ఏవిధంగా ఉంటాయోనని తర్జనభర్జన పడుతూ ఆరా తీస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం..!!

● చీటింగ్ కేసు నమోదు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని రూ.లక్ష తీసుకొని ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటన ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని మారుగూడ గ్రామానికి చెందిన పులిమామిడి కృష్ణచారి దగ్గరి నుంచి గత రెండు సంవత్సరాల క్రితం కొత్త కుమ్మరివాడకు చెందిన పోతిపెల్లి ప్రశాంత్ రూ.2 లక్షల ఇస్తే డీఆర్డీఏలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.లక్ష తీసుకున్నాడు. కాగా అప్పటి నుంచి ఉద్యోగం గురించి అడగగా.. రేపు మాపు అంటూ కాలం వెళ్లదీశాడు. గత జనవరి 24న ఉద్యోగం విషయం ప్రశాంత్‌ను అడగగా.. కృష్ణచారిని బెదిరించాడు. దీంతో బాధితుడు కృష్ణచారి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రశాంత్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ బి.సునీల్‌కుమార్ తెలిపారు.

● రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై..

ఆదిలాబాద్ రూరల్: మద్యం తాగి అతివేగంగా వాహనం నడుపుతూ ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బారీ రాజేశ్వర్ గౌడ్ అనే కారు డ్రైవర్ గురువారం రాత్రి మద్యం మత్తులో టవేరా కారుతో శ్రీరాం కాలనీ శివాలయం వద్ద పలువురిని ఢీ కొట్టి గాయపరిచాడు. దీంతో బాధితులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కార్ డ్రైవర్ రాజేశ్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

సాకెర మాజీ సర్పంచ్ మృతి

బోథ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని సాకెర గ్రామ మాజీ సర్పంచ్ ధరావత్ మీరాబాయి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యుడు అనిల్‌జాదవ్ సాకెర గ్రామానికి వెళ్లి ఆమె భౌతికాయానికి నివాళులర్పించారు. గ్రామపంచాయతీ ఏర్పాటు అయిన తర్వాత సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆమె మృతి సాకెర గ్రామస్థులకు తీరని లోటన్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వ్యాసరచన పోటీల్లో మహిళా ఎస్సై ప్రతిభ



మహిళా ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాలోని మహిళా ఎస్సై డి.జ్యోతిమణి ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచారని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మి మహిళా ఎస్సై జ్యోతిమణిని ప్రత్యేకంగా అభినందించి బహుమతిగా 15 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఏవో యూనిస్ అలీ, ఆర్ఐ రమేష్, రామృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ రవికుమార్‌లు పాల్గొన్నారు.

బీసీ కుటుంబాలపై రాజకీయ పార్టీల సవతి తల్లి ప్రేమ

● బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఎ.చంద్రశేఖర్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా బీసీలపై సవతి తల్లి ప్రేమను వీడి వారి హక్కుల సాధన సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... గత 20 సంవత్సరాలుగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బీసీ కుటుంబాల వారికి ఏ రాజకీయ పార్టీ కూడా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రకటించలేదని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీల సత్తా అంటే ఏంటో రాజకీయ పార్టీలకు చూపిస్తామని తెలిపారు.

మల్లు అనంతరాములు సేవలు మరువలేనివి

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్



ఖానాపూర్‌లో మల్లు అనంత రాములు ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఖానాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దివంగత కేంద్ర మాజీ మంత్రి మల్లు అనంతరాములు సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాహుల్‌గాంధీ ఫాలోవర్ ఫ్రంట్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ శనిగారపు కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లు అనంత రాములు 35వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిగా, 12 రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా, ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు మల్లు అనంతర రాములు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ఆయన 35వ వర్ధంతిని పురస్కరించుకుని మల్లు అనంత రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, ఖానాపూర్ మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బి. గోవింద్, జిల్లా నాయకులు రాసమల్ల ఆశోక్, నబీ ఖాన్, సార్ల నర్సయ్య, చొప్పదండి రాజేష్‌కుమార్, వేల్పుల రమేష్, మామిడిపల్లి బెన్నీ, జంగా అభిషేక్, తదితరులున్నారు.

మున్సిపాలిటీ కైవసం చేసుకునే దిశగా ముందుకు సాగాలి

● భైంసా బీజేపీ శ్రేణులతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



మున్సిపల్ మాజీ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాలతో మున్సిపాలిటీని కైవసం చేసుకునే దిశగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని భైంసా పట్టణ బీజేపీ శ్రేణులకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ సూచించారు. శుక్రవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో పదవీ కాలం ముగిసిన పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మానం నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు పదవీ కాలంలో తమ వార్డుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి అనిర్వచనీయమైన సేవలు అందించారని కొనియాడారు. మున్సిపాలిటీలో ప్రతికూల రాజకీయ పరిస్థితులకు ఎదురొడ్డి పార్టీకి చెందిన కౌన్సిలర్లు అకుంఠిత దీక్షతో ప్రగతికి సాధ్యమైన మేర కృషి చేసారని కితాబునిచ్చారు. వివక్షత ధోరణి విధానాలు, కక్ష్యపూరిత చర్యలతో పార్టీకి చెందిన కౌన్సిలర్లున్న కొన్నివార్డుల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే జరిగాయన్నారు. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరించుకునేందుకు, అవసరమైన ప్రగతి చేసుకునేందుకు గాను మున్సిపాలిటీని కైవసం చేసుకోవడమే ఏకైక మార్గమని వెల్లడించారు. ఇందు కొరకు గాను పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలతో మున్సిపాలిటీలో పాగ వేసేందుకు కార్యోన్ముఖులు కావాలని అకాంక్షించారు వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతూ మున్సిపల్ ఎన్నికల కోసం సన్నద్ధమవ్వాలని సూచించారు. మున్సిపాలిటీలో గ్రామాల విలీనం కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లుగా వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన విధానాలనే మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించి విజయభేరి మ్రోగించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ల బృందానికి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగర్ నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, సోలంకే భీంరావ్ పాటిల్, మానిక్ దగ్డేన్యామతబాద్ లింగోజీతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ కింద అభివృద్ధి పనులకు రూ. 10కోట్ల నిధులు మంజూరు

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల దళితవాడ కాలనీల్లో రోడ్లు, మురికి కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల కోసం గాను ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ. 10 కోట్లు మంజూరైనట్లుగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్కకు గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో దళితవాడల అభివృద్ధి కోసం గాను చేసిన విజ్ఞప్తి మేరకు సంబంధిత నిధులు మంజూరైనట్లుగా వెల్లడించారు. గత నెల 28న జీవో అర్‌టీ నెం 78 పీఆర్ అండ్ ఆర్‌డీ డిపార్ట్‌మెంట్ ద్వారా నిధుల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయని వివరించారు. ప్రస్తుతం ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే ఎస్టీ కాలనీల అభివృద్ధి కోసం గాను చేసిన విజ్ఞప్తి మేరకు ఎస్టీ సబ్ ప్లాన్ కింద సైతం నిధులు విడుదల కానున్నాయని వివరించారు. మంజూరైన రూ. 10కోట్ల నిధుల ద్వారా నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాలకు కేటాయించిన వివరాలను పేర్కొన్నారు.

గ్రామీణ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

● టీజీబీ రీజినల్ మేనేజర్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్‌ఎం

మామడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ రామారావు అన్నారు. మండలం లోని దిమ్మదుర్తి గ్రామంలో నిర్వహించిన ఎఫ్ఎల్‌సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ శాఖలో పొదుపు పథకాలు, గృహ లోన్, రైతు నేస్తం, వాహన రుణాలు, పలు సేవలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. పట్టణ, గ్రామీణ వ్యాపారులు, రైతులు ఖాతాలు తెరిచి మా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో తీసుకున్న అప్పులు చెల్లించి అధిక వడ్డీకి విముక్తి పొందాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించినట్లయితే ముందు ఎన్నో రుణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కొత్త శ్రీనివాస్, సీనియర్ అధికారి విలాస్, ఎఫ్ఎల్‌సీ సమన్వయ అధికారి రాజేందర్, గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి బలవన్మరణం

భైంసా రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతుల్‌గాంలో శుక్రవారం ఉరి వేసుకొని బోతేకర్ దిలీప్(30) ఉరివేసుకొని మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోతుల్ గ్రామానికి చెందిన బోతేకర్ దిలీప్ (30) ట్రాక్టర్ నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. దిలీప్‌కు గత సంవత్సరం పెళ్లి అయింది. మృతుడి భార్య అత్తగారింటికి రాను అని చెప్పడంతో భర్త మానసికంగా బాధపడేవాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని మృతి చెందాడు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

లోకేశ్వరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల రాజూర, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మన్మథ్‌లో చదువుకునే పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి పదవ తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాలన్నారు. పై చదువుల కోసం ఏదైనా మీకు ఇబ్బందులు ఏర్పడితే మీ వెంట నేనుంటాను. మీకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి పై చదువుల కోసం సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


జాతీయస్థాయిలో వుషు శిక్షణ పొందిన నిర్మల్ జిల్లా వాసులు



సాధించిన సర్టిఫికెట్లతో శిక్షకులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ నేషనల్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన 45 రోజుల వుషు కోచ్ సర్టిఫికెట్‌కు నిర్మల్ జిల్లా నుండి నలుగురు ఎంపికయ్యారని సాయి వుషు చీఫ్ కోచ్ రవి ప్రకాష్ త్రిపాఠి, సంగీత రాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత డిసెంబరు 1 నుండి జనవరి 29 వరకు పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించిన ఎన్ఎస్ఎన్ఐఎస్ వుషు స్పెషల్ కోచ్ సర్టిఫికెట్ బి గ్రేడ్‌ను సాధించారని తెలిపారు. వీరిలో శిక్షకులు కిన్నెర్ల మృణాళిని రవి, లోలం రాజశ్రీ, అవునూరు వారు ప్రతీక్ష, యర్వ సాయికిరణ్‌లను బుధవారం జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులను తయారు చేయాలని, శారీరకంగా మానసికంగాను చదువులోనే కాకుండా ఆటల్లో ముందుకు సాగాలని అలాగే జాతీయ స్థాయిలో జిల్లా పేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వుషు అధ్యక్షుడు ప్రేమ్ రాజ్, జిల్లా మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు కేజేందర్ సింగ్ భాటియా, కార్యదర్శి అబ్దుల్ కుమార్, శ్రీకాంత్, భూషణ్, స్వామి, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు టీ షర్ట్స్ అందజేత



క్రీడాకారులకు టీ షర్ట్స్ అందిస్తున్న జాన్సన్‌నాయక్

పెంబి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణంలో నిర్వహిస్తున్న కేపీకే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే రెయిన్‌బో వారియర్స్ టీంకు పెంబి బీఆర్ఎస్ యువ నాయకులు బడుగు మల్లేష్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడలు మనందరికి ఫిజికల్‌గా ఆరోగ్యంగా స్నేహ భావంతో ఉండడానికి దోహద పడుతాయన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెంబి మాజీ ఉప సర్పంచ్ గాండ్ల శంకర్, బడుగు మల్లేష్, షబ్బీర్, రాజేందర్, సురేందర్, మహేష్, తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకం వద్దు.. పర్యావరణమే ముద్దు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌జీసీ ఆధ్వర్యంలో శుక్రవారం దిలావర్‌పూర్‌లో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోకి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ర్యాలీలో నినాదించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్ ఎస్. పోశెట్టి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వామన్ రావు, పీడీ అంబాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్

కోవ విఠల్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బోథ్



ప్రశ్న: ప్రాక్టికల్ పరీక్షలు ఎప్పటినుండి జరగనున్నాయి?

ప్రిన్సిపాల్: ఈనెల 8 నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: ఎంతమంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలను రాయనున్నారు?

ప్రిన్సిపాల్: 89 మంది విద్యార్థులు ఇంటర్ రెండవ సంవత్సర ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొంటారు.

ప్రశ్న: పరీక్షలు నిర్వహణ ఏ విధంగా ఉంటుంది?

ప్రిన్సిపాల్: పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నాం ఎట్టి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలు నిఘా నీడన పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: వార్షిక పరీక్షలు ఎప్పటి నుండి ప్రారంభం అవుతున్నాయి

ప్రిన్సిపాల్: మార్చి ఐదు నుండి వార్షిక పరీక్షలను నిర్వహించడం జరుగుతుంది. పరీక్షలలో ఈసారి జంబ్లింగ్ విధానం ఉందన్నారు.

ప్రశ్న: ఎంతమంది పిల్లలు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు?

ప్రిన్సిపాల్: వార్షిక సంవత్సర పరీక్షలకు ఈసారి 395 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 237 మంది ఇంటర్ మొదటి సంవత్సరం కాగా ఒక 152 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికి తోడు మరో ఆరుగురు మంది ప్రైవేట్ వ్యక్తులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

ప్రశ్న: మాస్ కాపీయింగ్‌కు అవకాశాలు ఉన్నాయా?

ప్రిన్సిపాల్: ఎట్టి పరిస్థితుల్లోనూ మాస్ కాపీయింగ్ అవకాశం లేదు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులంతా జంబ్లింగ్ విధానంలో వేరే కళాశాలలో పరీక్షలకు హాజరవుతున్నారు. తమ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు ఎట్టి పరిస్థితిలో అవకాశం ఇవ్వం అని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

• (ఆంధ్రజ్యోతి, బోథ్)

రాములగుట్ట జాతరకు వేళాయే

● ముస్తాబైన ఆలయం ● రేపటి నుంచి జాతర ప్రారంభం ● 12న రథోత్సవం



ముస్తాబైన ఆలయం

తాంసి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాముల గుట్టపైన వెలసిన శ్రీ సీతారామ చంద్రుల ఆలయం జాతరకు ముస్తాబైంది. రాములోరి జాతర సందర్భంగా ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గుట్టపైకి వెళ్లే దారిలో ఉన్న రాళ్లను తొలగించారు. జిల్లాలోనే పురాతన ఆలయంగా పేరొందిన రాములగుట్ట జాతరను ప్రతియేటా పాలోది గ్రామస్థులు ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. జాతరకు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. నేటి నుంచి 12 వరకు జాతర కొనసాగుతుంది. నేడు ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్లి జాతర ప్రారంభిస్తారు. ఆలయ ప్రాంగణంలో హోమం, అర్చన, నవగ్రహ పూజలు నిర్వహిస్తారు. అనంతరం 12వ తేదిన సీతారాముల కళ్యాణాన్ని భక్తజనుల మధ్య ఘనంగా నిర్వహించి, రథోత్సవం నిర్వహించనున్నారు.



ఆలయంలో ప్రారంభమైన పూజలు



ఆలయంలో కొలువుదీరిన సీతారామ లక్ష్మణులు

● రాములగుట్ట చరిత్ర

శ్రీరాముడు వనవాస సమయంలో తాంసి మండలంలోని పాలోది శివారులో ఉన్న రాములగుట్ట ప్రాంతంలో సీతా, లక్ష్మణుల సమేతంగా వన వాసం చేసినట్లు స్థానిక చరిత్ర ద్వారా తెలుస్తుంది. వనవాస సమయంలో శ్రీ సీతారామ చంద్రుల వారు గుట్టపైన సేదతీరినట్లు వెళుతూ రాముడి పాదుకలు వదిలినట్లు పూర్వీకులు గుర్తించారు. గుట్టపై ఉన్న గృహలో శ్రీరాముడి పాదుకలను ఉంచి ప్రతియేటా స్థానికులు పూజలు చేసేవారు. స్వయంగా శ్రీరాముడు రాములగుట్టపైన ఉన్న శ్రీ సీతారామచంద్రుల ఆలయం వద్ద ఉన్న కోనేరుకు చాలా ప్రత్యేకత ఉంది. గుట్టపై ఉన్న కోనేరులో సంవత్సరం పొడవున జలధార ఉంటుంది. కోనేరులోని నీటిని తాగితే ఎలాంటి వ్యాధులు రావని, భక్తుల నమ్మకం. పంట చేలలో సైతం కోనేరు నీటిని తీసుకెళ్లి చల్లితే పంటలు బాగా పండుతాయి. ప్రతియేటా శ్రావణ మాసంలో జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రాముల గుట్టకు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రీరాముడు ఇక్కడే సేదతీరినట్లు గుర్తించిన నేపథ్యంలో క్రమంగా ఈ ప్రాంతాన్ని స్థానికులు అభివృద్ధి చేశారు. గుట్టపై ఆలయాన్ని నిర్మించి అందులో నూతన విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ సీతారామ చంద్రులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం అనవాయితీగా వస్తోంది. జాతర సందర్భంగా వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ జాతరను ఏర్పాటు చేయడంతో పోలీసులు ఇప్పటి నుంచి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

● అన్ని సౌకర్యాలు కల్పించాం



జాతర పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా ఉండేందుకు కోసం సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం. జాతర అటవీ ప్రాంతాల్లో నిర్వహించడంతో ప్రత్యేక బస్సులతో పాటు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. జాతర ముగింపు రోజు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నాం. దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి జరిగేలా చర్యలు చేపడుతాం.

• శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్

వైభవంగా ముత్యాల పోచమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన



ముత్యాల పోచమ్మ తల్లిని దర్శించుకుంటున్న భూక్యా జాన్సన్ నాయక్

కడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ ముత్యాల పోచమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో బీఆర్ ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాన్సన్ నాయక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, పోచమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా సుఖంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.



జాన్సన్ నాయక్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తాం

● కబడ్డీ అంతర్జాతీయ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్‌యాదవ్



రెండో బహుమతి గెలుచుకున్న నల్గొండ జిల్లా జట్టు







కబడ్డీ ఫైనల్ పోటీల్లో తలపడుతున్న నల్గొండ జిల్లా, సూర్యాపేట జిల్లా జట్టు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ తర్వాత కబడ్డీని ప్రజలు ఆదరిస్తున్నారని, క్రీడాకారులను ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తామని కబడ్డీ అంతర్జాతీయ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్‌యాదవ్ జగదీశ్‌యాదవ్ అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సీనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో సూర్యాపేట, నల్గొండ మధ్య జరిగింది. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో నల్గొండ 36 పాయింట్లు చేయగా సూర్యాపేట 39 పాయింట్లు సాధించి గెలిచింది. కాగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన జట్లకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీశ్‌యాదవ్ మాట్లాడుతూ ఒక సమయంలో క్రికెట్‌కు అత్యంత ఆదరణ ఉండేదన్నారు. నేడు గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి ఆదరణ రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఇటీవల జరిగిన ఏషియాలో తొలి బంగారు పతకం కబడ్డీ జట్టు దేశానికి అందించిందన్నారు. అదేవిధంగా భారతదేశంలో 2036లో జరిగే ఒలంపిక్స్‌లో కూడా తొలి బంగారు పతకం కబడ్డీ జట్టు అందిస్తుందన్నారు. మారుమూల ప్రాంతమైన ఆదిలాబాద్ లాంటి జిల్లాలో రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణ బ్రహ్మాండంగా నిర్వహించారన్నారు. ఈ పోటీల నిర్వహణ, వారిలోని పట్టుదల చూస్తుంటే జాతీయ పోటీలను కూడా అవలీలగా నిర్వహిస్తారనే నమ్మకం వస్తుందన్నారు. ఆదిలాబాద్‌లో ఉన్న ప్రకృతి అందాలతో పాటు ఇక్కడి క్రీడాకారులు, సంఘం నాయకుల్లో కష్టపడే తత్వం ఉందన్నారు. కబడ్డీలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో ఆడేలా కృషి చేస్తామన్నారు. అనంతరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కంరఘుపతి మాట్లాడుతూ సంఘం సభ్యుల సహకారంతో రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామని అన్నారు. నాలుగు రోజుల పాటు 33 జిల్లాల నుంచి క్రీడాకారులకు వసతితో పాటు ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ వేడుక విజయవంతానికి సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ కృషి ఎంతో ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీలను నిర్వహించే ధైర్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఇండియన్ కబడ్డీ కోచ్ శ్రీనివాస్‌ఎడ్డి, రాష్ట్ర కోశాధికారి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు రఘుపతి, రాష్ట్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



జాతరకు ముస్తాబవుతున్న మల్లన్న దేవుడి ఆలయం



ఆలయంలో మల్లన్న దేవుడి మూల విరాట్

11 నుంచి ఎడ్‌బిడ్ మల్లన్న దేవుడి జాతర

● జాతరకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు ● 14న కుస్తీ పోటీలు
● దేవుడి కల్యాణం తర్వాతే గ్రామంలో పెళ్లి ముహూర్తాలు

ముథోల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ మల్లన్న దేవుడి జాతర ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ, గ్రామస్థులు తెలిపారు. ఈ జాతర 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ నెల 11న రాత్రి శ్రీ మల్లన్న దేవుడి కల్యాణ మహోత్సవం, 12న చల్లని అంబళ్లు, 13న దేవుడి పల్లకి ఊరేగింపు, 14న కుస్తీ పోటీలు, రాత్రి అగ్నిగుండా ప్రవేశం, సుమారు రూ. లక్షతో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం మల్లయోధులు తరలివస్తారు. ఫైనల్ కుస్తీ పోటీల్లో ఫైనల్ విజేతలకు 10 వేల నగదు, 50 గ్రాముల వెండి కడియం, రెండో విజేతకు 5 వేల నగదు ఇవ్వనున్నామని తెలిపారు. 15న అడపడుచుల జాతర, అంబలి కుండ ఇంటికి తేవడంతో జాతర ముగ్గుస్తుంది. ఈ జాతరకు భైంసా నుంచి ప్రత్యేక బస్సులు నడుప బడుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రామంలో ప్రతీ సంవత్సరం దేవుడి కల్యాణం జరిగిన తర్వాతనే గ్రామంలో పెళ్లి కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది.

తల్లీ.. నాకు తలకొరివి పెట్టేవారెవరూ లేరు!

● ఎస్పీ జానకి షర్మిలను పట్టుకుని రోదించిన మావోయిస్టు శ్రీనివాస్ తల్లి లచ్చవ్వ
● తాను బతికుండగా తన కొడుకుని చూసే భాగ్యం లేదేమోనని కన్నీటి పర్యంతం
● శ్రీనివాస్ ఎక్కడున్నా జన జీవన స్రవంతిలోకి రావాలని ఎస్పీ జానకి షర్మిల పిలుపు



నిర్మల్ ఎస్పీని పట్టుకొని రోదిస్తున్న లచ్చవ్వ



యూజీ క్యాడర్ శ్రీనివాస్ తల్లి లచ్చవ్వతో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి

ఖానాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తనను పలకరించేందుకు వచ్చిన జిల్లా పోలీస్ బాస్‌ను చూసి ఆ తల్లి హృదయం తల్లడిల్లింది. ఒక్కసారిగా జిల్లా ఎస్పీని పట్టుకొని తల్లి నాకు తలకొరివి పెట్టే వారెవరూ లేరు అంటూ ఆ తల్లి రోదించిన తీరు అక్కడ ఉన్న వారందరినీ కదిలించింది. ఈ ఘటన నిర్మల్ పోలీస్ మీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల తన బృందంతో కలిసి శుక్రవారం ఖానాపూర్ మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో పర్యటించిన సందర్భంగా చోటుచేసుకుంది. బావాపూర్(ఆర్) గ్రామానికిచెందిన శ్రీనివాస్ 14 ఏళ్ల వయసులో ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటి వరకు అండర్ గ్రౌండ్‌లోనే ఉండిపోయిన నేపథ్యంలో ఆయన తల్లి లచ్చవ్వను కలిసిన జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆమెకు రెండు నెలలకు సరిపడా వంట సరుకులను, దస్తులను పంపిణీ చేశారు. అదే సమయంలో ఆత్మీయంగా శ్రీనివాస్ తల్లి తూము లచ్చవ్వను ఎస్పీ పలకరించడంతో ఆమె ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. 14 ఏళ్ల ప్రాయంలోనే తమ నుండి దూరంగా వెళ్లిపోయిన తమ కుమారుడు శ్రీనివాస్ తాను బ్రతికుండగా తన వద్దకు వస్తాడో లేదోనని ఈ జీవితంలో మళ్లీ తన బిడ్డను చూస్తానో లేదోనని లచ్చవ్వ ఆవేదన చెందారు. కనీసం తాను చనిపోతే తలకొరివి పెట్టేవారు కూడా ఎవరూ లేరంటూ ఆమె రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కలచి వేసింది. దీంతో లచ్చవ్వను ఓదార్చిన ఎస్పీ జానకి షర్మిల తల్లిగా మరో తల్లి ఆవేదనను తాను అర్థం చేసుకుంటానని వ్యాఖ్యానించారు. శ్రీనివాస్ ఎక్కడ ఉన్నా తాను ఎంచుకున్న పోరుబాట కన్నా తనను కన్న వారితో పాటు ఉన్న ఊరు మిన్నా అని భావించి తిరిగి జన జీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. జన జీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున అందజేయనున్న పునరావాసానికి సంబంధించిన అన్ని ప్రతిఫలాలు సకాలంలో అందేలా చూస్తానన్నారు. మావోయిస్టు పార్టీని వీడి తమ కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజేష్ మీనా, ఖానాపూర్ సీఐ సైదారావు సహా పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫొటో న్యూస్







పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న అనుకుంట నర్సరీ

నర్సరీ.. పట్టించుకునే వారేరీ..!?

పచ్చదనం పెంపొందించాలన్న ప్రధాన లక్ష్యంతో గతంలో ప్రారంభించిన నర్సరీలను పట్టించుకునే వారు కరువవుతున్నారు. ఇందుకు అనుకుంట నర్సరీ నిదర్శనంగా నిలుస్తోంది. చామంతి, జామ, నిమ్మ తదితర మొక్కలు పెంచేందుకు నర్సరీలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ.. సరైన పర్యవేక్షణ లేక పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి... నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలని, తద్వారా పర్యావరణ హితం దిశగా అడుగులు వేయలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

ధ్యాన హనుమాన్ విగ్రహాన్ని ముద్దాడిన వానరం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలని కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి చెంత శ్రీ ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో శుక్రవారం ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న 18 అడుగుల హనుమాన్ విగ్రహం పైకి ఓ వానరం వచ్చింది. అదిరించినా.. బెదిరించినా బెదరకుండా నేరుగా హనుమాన్ తలపైకి ఎక్కి భక్తితో తలను ముద్దాడింది. ఆ తర్వాత అటు ఇటు చూసి మెల్లిగా దిగి అడవిలోకి వెళ్లిపోయింది. భక్తులు జై శ్రీరామ్... జై హనుమాన్ అంటూ మొక్కుకున్నారు.





హనుమాన్ విగ్రహాన్ని ముద్దాడుతున్న వానరం



కడెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయడం అభినందనీయమని, 30 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ వలన సాధ్యమైందని మాదిగ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్, డిప్యూటీ సీఎం దామోదర రాజ నరసింహ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగర గిరి ప్రీతం చిత్ర పటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భూషణ్, చిన్నయ్య, రాజ నర్సయ్య, రవి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సన్నాల బోనస్ సంగతేమిటి ?



- రైతులకు అందని రూ.4.80 కోట్ల బోనస్ డబ్బులు
- జిల్లాలో 2483 మంది అన్నదాతల ఎదురుచూపులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు
- ముగిసిన సీఎంఆర్ గడువు
- కనిపించని కఠిన చర్యలు

నిర్మల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామంటూ చేసిన ప్రకటన పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. క్వింటాల్‌కు రూ.500 చొప్పున సన్న రకం ధా న్యానికి బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన కార్య రూపం దాల్చలేదు. కొంతమందికి మాత్రమే బోనస్ డబ్బులను చెల్లించిన ప్రభుత్వం చాలా మంది రైతులకు ఇప్పటి వరకు డబ్బులను చెల్లించకపోవడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. 2024-2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వం మొత్తం 1,14,185 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇందులో దొడ్డురకం ధాన్యం 80,839 మెట్రిక్ టన్నులు కాగా సన్నరకం ధాన్యం 33,345 మెట్రిక్ టన్నులుగా ఉంది. మొత్తం సన్నరకం ధాన్యానికి సంబంధించి 8870 మంది రైతుల వద్ద 33,345 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యానికి సంబంధించి రైతులకు 77.36 కోట్లను చెల్లించాల్సి ఉంది. రూ. 500 బోనస్ డబ్బులు 16.67 కోట్లను చెల్లించాలి. అయితే ఇప్పటి వరకు కేవలం 11.86 కోట్లను మాత్రమే రైతులకు చెల్లించారు. మిగతా రూ. 4.80 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉంది. బోనస్ డబ్బులు అందని రైతులు 2483 మందిగా మిగిలారు. వీరికి ఎప్ప టిలోగా బోనస్ డబ్బులను చెల్లిస్తారోననే అంశంపై సర్కారు నుంచి స్పష్టత రావడం లేదు. ప్రస్తుతం 2483 మంది రైతుల కుటుంబాలు బోనస్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వం నుంచి మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో ఈ డబ్బులు ఎప్పటిలోగా తమకు అందుతాయోనని రైతులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన దొడ్డు రకం ధాన్యం 80,835 మెట్రిక్ టన్నులకు గానూ 54,162 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాలి. కానీ ఇప్పటి వరకు సీఎంఆర్ రైస్ ఇవ్వలేదు. సన్నరకం ధాన్యం 33,345 మెట్రిక్ టన్నులకు గానూ సీఎంఆర్ రైస్‌ను 22,341 మెట్రిక్ టన్నులు ఇవ్వాలి. కానీ ఇప్పటి వరకు కేవలం 1438 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఇచ్చారు. సన్నరకం ధాన్యాన్ని సివిల్ సప్లయ్, దొడ్డు రకం ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కోసం ఇచ్చారు. ఇప్పటి వరకు సీఎంఆర్‌పై కూడా స్పష్టత రావడం లేదని అంటున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని సంచుల్లో నింపి ఉంచిన దృశ్యం (ఫైల్)

సీఎంఆర్‌పై నిండా నిర్లక్ష్యం

సీఎంఆర్‌పై ప్రభుత్వం ఇటు రైస్‌మిల్లర్లు నిండానిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 2023-2024 రబీ సీజన్‌కు సంబంధించి రైతుల వద్ద 1,56,842 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీనికి గానూ 1,05 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను అందించాలి. ఇప్పటి వరకు కేవలం 31,554 సీఎంఆర్ రైస్‌ను మిల్లర్లు ఇచ్చారు. ఇంకా 74,148 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం సర్కారుకు మిల్లర్లు చెల్లించాల్సి ఉంది. ఈ యేడు ఖరీఫ్ సీజన్‌లో అధికారుల చేత డిఫాల్ట్‌గా ప్రకటించబడిన 17 రైస్‌మిల్లులకు ఎలాంటి కేటాయింపులు జరపలేదు. ఈ రైస్‌మిల్లులను పూర్తిగా పక్కన పెట్టి మిగతా రైస్‌మిల్లులకు మాత్రమే సీఎంఆర్ కోసం ధాన్యాన్ని కేటాయించారు.

ముగిసిన సీఎంఆర్ గడువు

కాగా 2023-2024 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని తిరిగి పూర్తిస్థాయిలో చెల్లించేందుకు రైస్‌మిల్లర్లకు గత జనవరి 31వ తేదీ వరకు గడువు విధించారు. అయిన రైస్‌మిల్లర్లు గడువు పూర్తయినప్పటికి సీఎంఆర్ బియ్యాన్ని అందించలేకపోయారు. అయితే గడువు ముగిసి వారం రోజులు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకు రైస్‌మిల్లర్ల వైపు నుంచి గానీ అధికారుల వైపు నుంచి గానీ కనీస స్థాయిలో స్పందన రావడం లేదంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికే సీఎంఆర్ బియ్యం గడువులోగా చెల్లించని 17 రైస్‌మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించింది. అలాగే మరికొన్ని మిల్లులపై కేసులు కూడా నమోదు చేసింది. అయితే రైస్‌మిల్లర్లలో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.

కనిపించని కఠిన చర్యలు

కాగా రైస్‌మిల్లర్లు మొదటి నుంచి పథకం ప్రకారం సీఎంఆర్ ధాన్యం విషయంలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికి వారిపై ఎలాంటి కఠిన చర్యలు లేకపోతుండడం ఆ మిల్లర్లకు వరంగా మారుతోందంటున్నారు. తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్న అధికారులు సీఎంఆర్ బకాయిదారుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు కారణమవుతోందంటున్నారు. కోట్ల రూపాయల ధాన్యాన్ని సీఎంఆర్ కింద పక్కదొవ పట్టించినట్లు కూడా ఫిర్యాదులున్నప్పటికి ఇప్పటి వరకు ఈ దిశగా పూర్తిస్థాయిలో విచారణ జరగలేదు. కేవలం జరిమానాలతోనే సరిపెడుతున్నారన్న వాదనలున్నాయి. అధికారుల ఉదాసీన వైఖరిని ఆసరాగా చేసుకుంటున్న రైస్‌మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సిండికేట్‌గా ఏర్పడి తమకున్న రాజకీయ పలుకుబడి పరపతితో అధికారులపై ఒత్తిడిలు కూడా కొనసాగిస్తున్నారంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం సీఎంఆర్ బకాయి విషయంలో పకడ్బందీగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గజ్జలమ్మ నామస్మరణతో
మార్మోగిన కుంటాల



కుంటాలలో గజ్జలమ్మ మాలధారణ స్వీకరించిన భక్తులు

కుంటాల, ఫిబ్రవరి, 7 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల గజ్జలమ్మ నామస్మరణతో మారుమోగుతుంది. కుంటాల గ్రామ ప్రజల ఇలవేల్పయిన గజ్జలమ్మ 5 వ వార్షికోత్సవాన్ని ఈ నెల 9, 10, 11 తేదీలలో నిర్వహించనున్నారు. ఆదివారం నుంచి జరిగే వార్షికోత్సవం పురస్కరించుకొని ఇప్పటికే పలువురు గజ్జలమ్మ మాలధారణ స్వీకరించారు. శుక్రవారం 80 మంది భక్తులు గజ్జలమ్మ మాలధారణ స్వీకరించారు. గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాములందరికి బిక్షను ఏర్పాటు చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- జిల్లా విద్యాధికారి రామారావు



ట్రస్మా జిల్లా నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. పట్టణంలోని రవి ఉన్నత పాఠశాలలో కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్, ట్రస్మా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీవో, ఇస్రో, మిస్సైల్, సాటిలైట్లు, ఉపగ్రహ నౌకల మోడళ్లను వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో డైరెక్టర్, శాస్త్రవేత్త మిస్సైల్ అగ్ని 3 రూపకర్త డాక్టర్ కే. వీరబ్రహ్మం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రస్మా అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సెక్రటరీ గంగన్న, పద్మనాభగౌడ్, మండల విద్యాధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



కటికనపల్లి నాగన్న మృతదేహం

కడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నవాబ్‌పేట్ గ్రామంలో కటికనపల్లి నాగన్న(49) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి పేర్కొన్నారు.

పోలీసులకు పట్టుబడ్డ నగదు

కుభీర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం మండలంలో మహారాష్ట్ర సరిహద్దు గ్రామం సిర్పెల్లి(హెచ్) గ్రామశివారులో పోలసులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ సరిహద్దు మహారాష్ట్ర లోని కిని గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ. 81వేలు కుభీర్ మండలం మీదుగా తీసుకువెళుతుండగా వెలుతుండగా పోలీసులు పట్టుకున్నారు. రూపాయలకు సంబంధించిన రసీదు పత్రాలు చూపించాలని సదరు వ్యక్తికి తెలియజేశారు. ఎస్సై రవీందర్, పోలీసులు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదర్శనగర్ సబ్‌స్టేషన్, నిర్మల్ టౌన్, సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. నెలవారి మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని, విద్యుత్‌శాఖ అధికారి శుక్రవారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కుభీర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జామ్‌గామ్ గ్రామానికి చెందిన మెంచు నారాయణ అనే వృద్ధుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపాటిల్ బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. మృతికి గల కారణాలుఉ అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అండగా ఉంటామని హామి ఇచ్చారు. నాయకులు వడ్నం నాగేశ్వర్, ఏశాల దత్తాత్రి, ఎన్నిల నాగేందర్, గులాబ్ నాయక్, రాంబోల్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ ఇంజనీర్ల
డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో శుక్రవారం తెలంగాణ పద్మశాలి ఇంజనీర్ల డైరీ, క్యాలెండర్ పద్మశాలి ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి మధుకర్, ప్రధాన కార్యదర్శి బూర ఉమా శంకర్, తాటిపాముల శంకరయ్య, వడ్లకొండ వెంకటపతి, జల్దా గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇంటి పన్ను వసూలు, వన మహోత్సవం, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో త్రాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చేతి పంపులు, బోరు బావుల పనితీరును పర్యవేక్షించి, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. తీవ్రమైన నీటి ఒత్తిడి గల మండలాలను గుర్తించి ఆయా మండలాల్లోని గ్రామాల్లో నీటి సమస్యను అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పన్ను వసూలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్ను వసూలు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వసూలు చేసిన పన్నులకు చలానాలు కట్టి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల వ్యాపారస్తుల వాణిజ్య లైసెన్స్‌లను వందశాతం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవం నాటికి గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తనిఖీ చేసి నివేదికలను పంపాలన్నారు. గ్రామాల్లో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్యాన్ని కొనసాగించాలన్నారు. మండల స్థాయి అధికారులకు గ్రామీణ స్థాయి అధికారులపై నియంత్రణ కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ పరీక్షా ఫలితాల విడుదలలో తప్పులు

- రెండు సబ్జెక్టులకు ఒకటే మార్కులు
- సీఓఈ ఛాంబర్‌ను ముట్టడించిన విద్యార్థులు
- నిజ నిర్ధారణ కమిటీని నియమించిన వైస్ చాన్సలర్

బాసర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ పరీక్షా ఫలితాల విడుదలలో సాంకేతిక సమస్యతో తప్పులు దొర్లాయి. ఒక సబ్జెక్టు మార్కులు రెండు సబ్జెక్టులకు కేటాయించడంతో.. చాలా మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. దీంతో విద్యార్థులు శుక్రవారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఛాంబర్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ట్రిపుల్ ఐటీలోని ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం సెమిస్టర్ -2 పరీక్షా ఫలితాలను అధికారులు ఇటీవల విడుదల చేశారు. పరీక్షలు బాగా రాసినప్పటికీ.. ఫెయిల్ అని ఫలితం రావడంతో 18మంది విద్యార్థులు రూ.200 చెల్లించి రీవాల్యుయేషన్ చేయించగా, లోపాలు వెలుగు చూశాయి. ఒక సబ్జెక్టు మార్కులు రెండు సబ్జెక్టులకు కేటాయించడంతో.. చాలా మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఈ పొరపాటును గుర్తించిన అధికారులు.. వెంటనే 18 మంది విద్యార్థులకు సరిచేశారు. దీంతో మొత్తం విద్యార్థుల పరీక్షా ఫలితాలను పునః పరిశీలించాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థులు శుక్రవారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఓఈ) అధికారులను నిలదీశారు. ఛాంబర్ వద్ద నిరసన తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. పరీక్షా ఫలితాల విషయంలో చాలా రోజుల నుంచి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు బాగా రాసినా.. ఫెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేపర్ వాల్యుయేషన్ చాలెంజ్ ఫీజు రూ. 10వేలు ఉంచడంతో చాలా మంది ఇక్కడ చదువుకునే నిరుపేద విద్యార్థులు అంత మొత్తం చెల్లించలేక వెనుకంజ వేస్తున్నారు. అయితే ఈసారి మాత్రం విద్యార్థుల అభ్యంతరాలు ఎక్కువ కావడం.. సంబంధిత సబ్జెక్టు అధ్యాపకులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో.. పరీక్షా పేపర్లను పరిశీలించిన అధికారులకు జరిగిన పొరపాట్లు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి పొరపాట్లు చాలా రోజుల నుంచి జరుగుతున్నాయని, ఎన్నిసార్లు విన్నవించినా పట్టించులేదని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు. మరోవైపు.. ఈ విషయమై నిజ నిర్ధారణ కోసం కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



బాసర ట్రిపుల్ ఐటీలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగపు అధికారులపై విద్యార్థుల ఆగ్రహం

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



భైంసాలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

భైంసా, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లు నేరవేర్చాలని పేర్కొంటు శుక్రవారం భైంసా డిపో, బస్టాండ్ ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు డిపో జేఏసీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. యాజమాన్యం ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా డిపో ప్రవేశ మార్గంలో, బస్టాండ్ ఆవరణలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాది కాలం పూర్తయినప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నేరవేర్చడాన్ని విస్మరించిందని ఆరోపించారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే రీతిలో ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా తామందరం సమ్మె బాట పట్టడానికి సన్నద్ధమయ్యాయని వెల్లడించారు. ప్రభుత్వం ఇకనైన స్పందించి ఎన్నికల హామీలను, తమ డిమాండ్లను నేరవేర్చాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసే విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీలో కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఆర్టీసీలోని ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేని పక్షంలో సమ్మె అనివార్యమని వెల్లడించారు.

చిట్యాలలో పోలీసు ఆధ్వర్యంలో
కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సైబర్ క్రైమ్, డయల్ 100, రహదారి ప్రమాదాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 58 బైక్‌లు, 4 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్సై లింబాద్రి, దిలావర్‌పూర్, నర్సాపూర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమ్మ రమాబాయి అంబేద్కర్ జయంతి



అమ్మ రమాబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మాదిగల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అమ్మ రమాబాయి అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ ఎస్సీ కాలనీలో ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నిగులపు లింగన్న, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కత్తి నరేందర్, దత్తసాయిబాబా దర్మకర్త కత్తిసురేష్, కత్తి సుధాకర్, ఉప్పరి రవి, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్ మండల కేంద్రంలో..

కుభీర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమని రమాబాయి అంబేద్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.